10 YEAR ANNIVERSARY 2014 - 2024

# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

శుక్రవారం 24 జనవరి 2025 పేజీలు 8

## జగిత్యాలలో పెద్దపులి కలకలం: అవుపై దాడి చేసి చంపేసింది.. భయం గుప్పిట్లో జనం..





హైదరాబాద్ పెన్ పవర్:జగిత్యాల జిల్లాలో పెద్దపులి సంచారం కలకలం రేపింది. జిల్లాలోని కొడిమ్యాల మండలం కొండాపూర్ శివారులో పెద్దపులి సంచరించింది.బుధవారం ( జనవరి 22, 2025 ) కొండాపూర్ శివారులోని పొలాల దగ్గర ఓ అవును గొంతు కొరికి చంపేసింది పెద్దపులి. సీసీ కెమెరాలలో రికార్డయిన దృశ్యాల ఆధారంగా పెద్దపులిగా నిర్ధారించారు ఫారెస్ట్ అధికారులు. ఈ ఘటనతో రాత్రిపూట బయటకు వెళ్లకూడదని గ్రామ ప్రజలకు ఆదేశించిన ఫారెస్ట్ అధికారులు.

-2 లో







# రోడ్డు రోలర్ దొంగతనం కేసులో.... అంతర్‌రాష్ట్ర ముఠా అరెస్ట్

- ఈనెల 20వ తేదీన జీడిమెట్ల ఇండస్ట్రియల్ పార్క్ సమీపంలో పార్క్ చేసిన రోడ్డు రోలర్..
- తమ రోడ్డు రోలర్ వాహనాన్ని దొంగలు ఎత్తుకెళ్ళారని 21న జీడిమెట్ల పియస్‌లో ఫిర్యాదు..
- పోలీసుల దర్యాప్తులో సిసి కెమెరాలు కీలకపాత్ర.. కేసును త్వరితగతిన ఛేదించిన పోలీసులు..
- డీసిఎం బ్రేక్‌డౌన్ కావడంతో రోడ్డరోలర్ సేఫ్, 4 గురు అంతర్‌రాష్ట్ర ముఠా దొంగలు అరెస్ట్, రిమాండ్..

## జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో బాలానగర్ డి.సి.పి సురేష్ కుమార్ విలేఖరుల సమావేశం..



జీడిమెట్ల, పెన్ పవర్, జనవరి 23:వాహనాల దొంగతనంలో చివరికి రోడ్డు రోలర్‌ను కూడా దొంగలు వదలడం లేరు.. అంతపెద్ద వాహనాన్ని ఇంత సులభంగా ఎత్తుకెళ్ళి పోలీసులను విస్మయానికి గురిచేసిన ఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. అత్యంత త్వరితగతిన ఛేదించిన తమ పోలీసులను బాలానగర్ డీసీపీ సురేష్ కుమార్ గురువారం పత్రికా సమావేశంలో ప్రశంసించారు.. బాలానగర్ డీసీపీ ప్రెస్‌మీట్‌లో తెలిపిన వివరాల ప్రకారం.. జీడిమెట్ల పి.యస్ పరిధి సుభాష్ నగర్‌లో రోడ్డు పనులు చేసిన రోడ్డు రోలర్ (బిఆర్ నెం: ఏపి 13 7212 నెంబర్ గల రోడ్డు రోలర్ వాహనం.. 20వ తేదీన జీడిమెట్ల ఇండస్ట్రియల్ పార్క్ సమీపంలో పార్కింగ్ చేసి, ఇంటికెళ్ళారు..మరుసటి రోజు వచ్చేసరికి రొడ్డు రోలర్ కనిపించకపోవడంతో,యజమాని లక్ష్మణ్ 21వ తేదీన జీడిమెట్ల పోలీసులకి ఫిర్యాదు చేసినట్లు డీసీపీ సురేష్ కుమార్ పత్రికా సమావేశంలో తెలిపారు.. సాధారణంగా రోడ్డు రోలర్స్ లాంటి భారీ వాహనాలు దొంగలించి ముక్కలుగా విభజించి, విడిభాగాలను విక్రయిస్తున్నట్లు తెలుసుకున్న పోలీసులు ఆకోణంలోనే దర్యాప్తు ప్రారంభించారు.. ఈ దర్యాప్తుకు సీసీ కెమెరాలు కీలకంగా ఆధారపడ్డాయి.. రోడ్డు రోలర్‌ను డిసియంలోకి క్రేన్‌ల ద్వార డిసియం లోకి ఎక్కించి తరలించే క్రమంలో డిసియం బ్రేక్ డౌన్ అయింది.. దీంతో దుండగులు వాహనాలను అక్కడే వదిలేసి వెళ్లిపోయారు.. ఈ దృశ్యాలన్ని సిసి కెమరాల ద్వార గుర్తించిన పోలీసులు ఈ కేసులో నలుగురు అంతర్‌రాష్ట్ర ముఠా సభ్యులను అరెస్టు చేయగా మరొక దొంగ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.. నిందితుల నుండి దొంగిలించిన రోడ్డు రోలర్‌తో పాటు, డిసియంలో ఉన్న రోడ్డురోలర్, రెండు భారీ క్రేన్‌లు, 4 సెల్‌ఫోన్‌లు సీజ్ చేశారు. వీరు గతంలో కూడ రోడ్డు రోలర్‌ను దొంగలించి ముక్కలుగా కట్ చేసి స్క్రాప్‌లో అమ్ముతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.. పోలీసులు స్వాధీన పరుచుకున్న వాహనాల విలువ రూ.30 లక్షలు వరకు ఉంటుందని అంచనా.. కర్ణాటకకు చెందిన నిందితులు అఫ్రోజ్ అహ్మద్ పటేల్(24), మొహమ్మద్ ఇబ్రహీం(31),షేక్ అన్వర్ (35),బల్లా రామ్ సత్యనారాయణ(47) అరెస్ట్ కాగా, సయ్యద్ ముస్తఫా పరారీ ఉన్నట్లు వీరిపై కేసులు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు బాలనగర్ డిసిపి సురేష్ కుమార్ పత్రికా సమావేశంలో తెలిపారు.. కేసును త్వరితగతిన ఛేదించిన జీడిమెట్ల పోలీసులను డిసిపి ప్రశంసించారు..

## తెలంగాణలో రూ.60,000 కోట్లు పెట్టుబడి పెట్టనున్న అమెజాన్




- దావోస్ వేదికగా జరిగిన ఒప్పందం
- రాష్ట్రంలో డేటా సెంటర్లను విస్తరించేందుకు భారీ పెట్టుబడి
- అమెజాన్ వెబ్ సర్వీసెస్ గ్లోబల్ పబ్లిక్ పాలసీ వైస్ ప్రెసిడెంట్‌తో సీఎం భేటీ

-2 లో

## పార్టీలో చర్చించి నిర్ణయం: మేయర్‌పై అవిశ్వాస తీర్మానంపై తలసాని క్లారిటీ

హైదరాబాద్ పెన్ పవర్: జీహెచ్‌ఎంసీ మేయర్, డిప్యూటీ మేయర్‌లపై బీఆర్ఎస్ అవిశ్వాస తీర్మానానికి సిద్ధమైందన్న టాక్ గత మూడు రోజులుగా సిటీ పాలిటిక్స్‌లో తీవ్ర చర్చనీయాంశం అయ్యింది. ఈ క్రమంలో మేయర్‌పై అవిశ్వాస

-2 లో





## జగిత్యాలలో పెద్దపులి కలకలం: అవుపై దాడి చేసి చంపేసింది.. భయం గుప్పిట్లో జనం..

- మొదటి పేజీ తరువాయి

పొలం దగ్గర ఉన్న అవును గొంతు కొరికి చంపేసిన పులి.. ఆవు వెనుక భాగం పూర్తిగా మాంసం తిని వెళ్లిపోయినట్లు తెలిపారు అధికారులు. పెద్దపులి ఎప్పుడు ఎటువైపు నుంచి వస్తుందో అని భయాందోళనతో గడుపుతున్నామని అంటున్నారు గ్రామస్తులు. ఈ ఘటనతో అప్రమత్తమైన అటవీ అధికారులు కొండాపూర్ ప్రాంతంలో అదనపు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

## పార్టీలో చర్చించి నిర్ణయం: మేయర్‌పై అవిశ్వాస తీర్మానంపై తలసాని క్లారిటీ

- మొదటి పేజీ తరువాయి

తీర్మానంపై బీఆర్ఎస్ సీనియర్ నేత, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ క్లారిటీ ఇచ్చారు. మేయర్, డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాస తీర్మానంపై శనివారం (జనవరి 25) జరగనున్న పార్టీ మీటింగ్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. గురువారం (జనవరి 23) %+నవీజ% కమిషనర్ తో గ్రేటర్ హైదరాబాద్ చెందిన బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు భేటీ అయ్యారు. మాజీ మంత్రి తలసాని ఆధ్వర్యంలో కమిషనర్ ఇలాంబర్తి న కలిసిన బీఆర్ఎష్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు హైదరాబాద్‌లోని ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులపై వినతిపత్రం సమర్పించారు.

అనంతరం తలసాని మీడియాతో మాట్లాడుతూ.. నగరంలో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని.. వాటిని పరిష్కారించాలంటూ కమీషనర్ కి వినతిపత్రం ఇచ్చామని తెలిపారు. స్ట్రీట్ లైట్స్ ఎక్కడ వెలగట్లేదు, రోడ్లు సరిగ్గా లేవు, ఫ్లై ఓవర్స్ నిర్మాణాలు ఆగిపోయాయని అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వచ్చిన మొదటి ఏడాది ఏ పనులు చేయకపోయినా సైలెంట్ గా ఉన్నాం.. ఇక నుంచి నిలదీస్తామన్నారు. లక్షల సంఖ్యలో రేషన్ కార్డుల అప్లికేషన్లు వచ్చాయని.. అప్లై చేసుకున్నా వారందరికి రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులకు సంబంధించి అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని.. స్థానిక ఎమ్మెల్యేలకు చెప్పకుండానే శంకుస్థాపనలు చేస్తున్నారని మండిపడ్డారు. అధికారులు కనీసం మా ఫోన్లు ఎత్తడం లేదని.. మా నెంబర్లు కూడా బ్లాక్ చేస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడుతున్నా కొత్త ప్రభుత్వం సెట్ అయ్యే వరకు టైమ్ పడుతుందని ఇన్ని రోజులు మేం ఎలాంటి ఆందోళన చేయలేదని.. ఇకపై ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. జీహెచ్ఎంసీ కౌన్సిల్ లో మా పార్టీ సభ్యులే మెజారిటీ ఉన్నారని.. అయినా మా సభ్యుల ప్రశ్నలు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు

## తెలంగాణలో రూ.60,000 కోట్లు పెట్టుబడి పెట్టనున్న అమెజాన్

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణలో రూ.60 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు అమెజాన్ అంగీకారం తెలిపింది. ఈ మేరకు అమెజాన్, తెలంగాణ ప్రభుత్వం మధ్య ఒప్పందం కుదిరింది. దావోస్‌లో అమెజాన్ వెబ్ సర్వీసెస్ గ్లోబల్ పబ్లిక్ పాలసీ వైస్ ప్రెసిడెంట్ మైకేల్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు.తెలంగాణలో అమెజాన్ భారీ పెట్టుబడితో రాష్ట్రంలో డేటా సెంటర్లను అమెజాన్ విస్తరించనుంది. వీటికి అవసరమైన భూమిని కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది.ఇన్ఫోసిస్ సీఎఫ్ఓ సంగ్రాజ్‌తో తెలంగాణ ఐటీ మంత్రి శ్రీధర్ బాబు సమావేశమయ్యారు. పోచారంలో ఐటీ క్యాంపస్ విస్తరణకు ఇన్ఫోసిస్ అంగీకారం తెలిపింది. రూ.750 కోట్లతో మొదటి దశ విస్తరణ చేపడతామని ఇన్ఫోసిస్ తెలిపింది. దీంతో కొత్తగా 17 వేల ఉద్యోగాలు రానున్నాయని అధికారులు తెలిపారు.

# తన కార్యాలయంపై దాడిని ఖండించిన ఎమ్మెల్యే గూడెం

**హైదరాబాద్ పెన్ పవర్:**
పటాన్ చెరు నియోజకవర్గంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై కాంగ్రెస్ నేతల దాడిని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఖండించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై కాంగ్రెస్ నేతల దాడి దుర్మార్గమైన ఆలోచన. దాడి వెనుక నుండి నడిపించిన కాటా శ్రీనివాస్ గౌడ్ దుర్మార్గుడు. జీవితంలో కాటా శ్రీనివాస్ గౌడ్ ఎమ్మెల్యే గా గెలవడని అన్నారు.

మూడుసార్లు ఓడిన కాటా శ్రీనివాస్ గౌడ్ కు కనీసం సిగ్గు లేదు.. రాలేదు. ఒకసారి ప్రజలు సర్పంచ్ గా గెలిపిస్తే ట్రెజరిని పూర్తిగా మాయం చేసాడు. పిచ్చి పిచ్చి ఆలోచనలను కాటా మానుకోవాలిపటాన్ చెరు నియోజకవర్గంలోని 3 మునిసిపాలిటీలకు కాలపరిమితి పూర్తవుతున్న క్రమంలో అభివృద్ధి పనులకు వేగంగా శంకుస్థాపనలు చేసుకుంటున్న క్రమంలో సహకరించాల్సిన కాంగ్రెస్ నేతలు, వ్యతిరేకంగా కార్యక్రమాలు చేయటం మంచిది కాదు.

క్యాంప్ కార్యాలయం ఎమ్మెల్యే ఇళ్లు లాంటిది దానిపై దాడి చేయటం దారుణమని అన్నారు. కార్యకర్తలను ఎలా కాపాడుకోవాలో తనకు తెలుసు. కొందరు చీప్ మెంటాలిటీతో పని చేస్తున్నారు. క్యాంప్ కార్యాలయం పై దాడికి సంబంధించి జిల్లా ఎస్పీ, ఐజిలతో పాటు కాంగ్రెస్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేయటం జరిగిందని అన్నారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసారు..

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

**హైదరాబాద్ పెన్ పవర్:**
ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలతో పాటు అన్ని వసతి గృహాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని రాష్ట్ర మైనార్టీ వెల్ఫేర్ డైరెక్టర్, ఉద్యాన శాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్ భాష,వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి లు పేర్కొన్నారు గురువారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ఎస్టి బాలికల గురుకుల విద్యాలయంలో వారు విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం వసతి గృహాల్లో విద్యనభ్యసించే విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో 40% డైట్ చార్జీలను కాస్మోటిక్ చార్జీలను పెంచిందని, వీటితోపాటు నాణ్యమైన విద్య అందించేందుకు ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషనల్ హబ్బులను నిర్మిస్తోందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వనపర్తి నియోజకవర్గంలో మైనార్టీలకు సంబంధించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి 43 పనుల మంజూరీలను కోరుతూ, ఉద్యాన శాఖ తరఫున మంజూరు చేసే తుంపర సేద్యం కు సంబంధించి 3600 యూనిట్లను మంజూరు చేయాలని కోరుతూ స్థానిక శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి నేరుగా నివేదికలను సమర్పించారుఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి అఫ్జలుద్దీన్, బీసీ సంక్షేమ శాఖ అధికారి సుబ్బారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆ ఏరియాలో ప్లాట్లు కొంటుంటే జాగ్రత్త..! ఫారెస్ట్ ల్యాండ్ చూపెట్టి 50 వేల మందిని మోసం చేశారు




హైదరాబాద్ పెన్ పవర్:మహావీర్ హరిణ వనస్థలి నేషనల్ పార్క్(Mahavir Harina Vanasthali National Park) అడవి భూములకు ముప్పొచ్చింది. కొందరు అక్రమార్కులు నేషనల్ పార్క్ స్థలాన్ని ప్రైవేట్ ల్యాండ్‌గా చూపిస్తూ అమ్మకాలుసాగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అటువంటి వారి మాటలు నమ్మి అమాయకులు మోసపోవద్దని శంషాబాద్ డిఎఫ్ఓ విజయానంద్, సరూర్ నగర్ ఎంఆర్ఓ వేణుగోపాల్ తెలిపారు. ఫారెస్ట్ ల్యాండ్ చూపెట్టి 50వేల మందికి మోసం

**అసలేం జరిగిందంటే..?**

ఎల్బీ నగర్ మన్సూరాబాద్‌లోని సర్వే నంబర్ 7లో 582 ఎకరాల ఫారెస్ట్ ల్యాండ్ ఉండగా.. ఆ భూమి తమ తల్లిదని యూసఫ్ ఖాన్‌తో పాటు ఆయన భార్య తులసమ్మ అలియాస్ సుల్తానా గిఫ్ట్ డీడ్, సేల్ డెడ్, నోటరీ ప్లాట్ల ఫేక్ డాక్యుమెంట్ రాయించి అమాయకులకు అమ్ముతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ నెల 26న గణతంత్ర దినోత్సవ సందర్భంగా సర్వే నెంబర్ 7లో జెండా ఎగరేయబోతున్నట్లు ప్లాట్లు కొనుగోలు చేసిన వారు పెద్ద ఎత్తున అక్కడికి రావాలని మహ్మద్ జిలాని అనే వ్యక్తి పేరుతో సోషల్ మీడియాలో ప్రకటనలు వ్యాప్తి చేశారు.

ఈ విషయం పోలీసుల చెవిన పడడంతో ప్రజలను అప్రమత్తం చేశారు. ఫారెస్ట్ ల్యాండ్‌లో ఎటువంటి ప్లాట్లు లేవని.. ఎవరూ కూడా ఆ డాక్యుమెంట్స్ చూసి మోసపోవద్దని సూచించారు. ఇప్పటికే కొనుగోలు చేసిన వారు ఎవరైనా ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేస్తే తగిన న్యాయం జరిగే అవకాశం ఉంటుందని సూచించారు. మోసగాళ్ల మాటలు నమ్మి ఎవరైనా ఫారెస్ట్ భూముల్లోకి వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటుంటామని హెచ్చరించారు.


సర్వే నంబర్ 7లోని 582 ఎకరాల భూమి ఎన్నో ఏళ్లుగా ఫారెస్ట్ భూమిగా రికార్డుల్లో ఉన్నట్లు తెలిపారు. ఆ భూమి ప్రైవేట్ భూమి అని క్లెయిమ్ చేసేందుకు పిటీషనర్ తరపు న్యాయవాది ఇప్పటివరకు 280 పిటీషన్స్ దాఖలు చేయగా.. వాటిని కోర్టు కొట్టేసిందని ప్రజలకు గుర్తుచేశారు. కావున తక్కువ ధరకు వస్తున్నాయని అడవీ భూములు కొని మోసపోవద్దని పోలీసులు ప్రజలకు సూచించారు.

# హైదరాబాద్‌కు రెండు భారీ డేటా సెంటర్లు: రూ.10 వేల కోట్లకు దావోస్‌లో డీల్

**హైదరాబాద్ పెన్ పవర్:** దావోస్ వేదికగా జరుగుతోన్న వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో తెలంగాణకు పెట్టుబడుల వెల్లువ కొనసాగుతోంది. రాష్ట్రంలో ఇన్వెస్ట్‌మెంట్ చేసేందుకు ప్రముఖ కంపెనీలు ఆసక్తి చూపిస్తున్నాయి. ఈ క్రమంలోనే మరో రెండు ప్రముఖ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. ఉర్సా క్లస్టర్స్, బ్లాక్ స్టోన్ సంస్థలు తెలంగాణలో ఇన్వెస్ట్‌మెంట్ చేసేందుకు అంగీకరించాయి. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వంతో ఇరు కంపెనీల ప్రతినిధులు అవగాహన ఒప్పందం (ఎంవోయూ) చేసుకున్నారు.

**ఉర్సా క్లస్టర్స్ దాదాపు రూ. 5000 కోట్లు**

అమెరికాకు చెందిన ఉర్సా క్లస్టర్స్ దాదాపు రూ. 5000 కోట్లతో తెలంగాణలో అత్యాధునిక అర్టిఫిషియల్ డేటా సెంటర్ హబ్‌ను స్థాపించనుంది. దీనికి సంబంధించి దావోస్ లో రాష్ట్ర ప్రభుత్వంతో ఈ సంస్థ అవగాహన ఒప్పందం చేసుకుంది. కంపెనీ సీవోవో సతీష్ అబ్బూరి, సీఆర్వో ఎరిక్ వార్నర్ ఈ ఒప్పందంపై సంతకం







చేశారు. హైదరాబాద్ లో 100 మెగావాట్లతో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తామని కంపెనీ సీఈవో పెందుర్తి అన్నారు. ఇందులో హైబ్రిడ్ ఏఐ చిప్‌లను ఉపయోగిస్తామని చెప్పారు. ఈ ప్రాజెక్టుపై దాదాపు రూ.5000 కోట్లు పెట్టుబడులు పెడుతున్నట్లు ప్రకటించారు. ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ఉర్సాతో భాగస్వామ్యం పంచుకోవటంతో అత్యాధునిక సాంకేతికత రంగంలో రాష్ట్రం మరో ముందడుగు వేస్తుందని అన్నారు.

**బ్లాక్ స్టోన్ రూ.4,500 కోట్ల పెట్టుబడులు**

పెట్టుబడులు, మౌలిక సదుపాయాలలో ప్రపంచ అగ్రగామి సంస్థ బ్లాక్‌స్టోన్ హైదరాబాద్లో డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. ఈ మేరకు దావోస్ లో తెలంగాణ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం చేసుకుంది. రూ.4500 కోట్లతో రాష్ట్రంలో 150 మెగావాట్ల డేటా సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు కంపెనీ ప్రకటించింది. బ్లాక్‌స్టోన్ లూమినా (బ్లాక్‌స్టోన్ యొక్క డేటా సెంటర్ విభాగం)తో పాటు జేసీకే ఇన్‌ఫ్రా ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ప్రతిపాదిత డేటా సెంటర్ రూ.4,500 కోట్ల వరకు పెట్టుబడి పెడుతుంది. ఇంధన సామర్థ్యం, అధునాతన శీతలీకరణ వ్యవస్థలు, సైబర్ భద్రతా ప్రోటోకాల్ అవసరాలకు సంబంధించి ఏఐ ఆధారిత సేవలను ఈ డేటా సెంటర్ అందిస్తుంది. బ్లాక్‌స్టోన్ లుమినా ప్రపంచంలోని ప్రముఖ క్లౌడ్ మౌలిక సదుపాయాల ప్రొవైడర్లలో కీలకంగా ఉంది. ఈ కంపెనీ ప్రభుత్వంతో భాగస్వామ్యం పంచుకోవటంతో మిగతా విదేశీ కంపెనీలు సైతం తెలంగాణ వైపు చూస్తున్నాయి. ప్రపంచ దిగ్గజ సంస్థలకు తెలంగాణ గమ్యస్థానంగా మారనుంది.

## దావోస్ లో తెలంగాణ ప్రభుత్వం సూపర్ సక్సెస్... రికార్డు స్థాయిలో ఒప్పందాలు!

**10 కంపెనీలతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందాలు**

**రాష్ట్రానికి రానున్న పెట్టుబడుల విలువ రూ. 1.32 లక్షల కోట్లు**

**గత ఏడాది కంటే మూడు రెట్లు పెరిగిన పెట్టుబడులు**

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణకు భారీ పెట్టుబడులను తీసుకురావడమే లక్ష్యంగా దావోస్ పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి విజయవంతంగా పర్యటనను ముగించారు. రికార్డు స్థాయిలో పెట్టుబడులను ఆకర్షించడంలో తెలంగాణ ప్రభుత్వం సూపర్ సక్సెస్ అయింది. మూడు రోజుల దావోస్ పర్యటనలో ఏకంగా రూ. 1.32 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయి. మొత్తం 10 కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం కీలక ఒప్పందాలు చేసుకుంది. కొత్త ఒప్పందాలతో 46 వేల మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది.




గత ఏడాది దావోస్ పర్యటనతో తెలంగాణకు రూ. 40,232 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఈ ఏడాది పెట్టుబడులు మూడింతలు పెరగడం గమనార్హం. ఈ ఏడాది రేవంత్ నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' బృందం అంచనాలకు మించి సక్సెస్ అయింది. ఈ సాయంత్రం వీరంతా దావోస్ పర్యటనను ముగించుకుని హైదరాబాద్ కు తిరుగుపయనం కానున్నారు. రేపు వీరు హైదరాబాద్ కు చేరుకుంటారు.

**తెలంగాణ ప్రభుత్వంతో ఎంవోయూలు కుదుర్చుకున్న సంస్థలు ఇవే:**

అమెజాన్ వెబ్ సర్వీసెస్: ఏఐ, క్లౌడ్ సర్వీసెస్ డేటా సెంటర్లు – రూ. 60 వేల కోట్ల పెట్టుబడులు.

జేఎస్ డబ్ల్యూ – ఏఐ డేటా సెంటర్ – రూ. 800 కోట్లు.

కంట్రోల్ ఎస్: ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ – రూ. 10 వేల కోట్లు.

సన్ పెట్రో కెమికల్స్: సోలార్ ప్రాజెక్టులు, భారీ పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్తు – రూ. 45,500 కోట్ల పెట్టుబడులు.

మేఘా ఇంజినీరింగ్: పంప్డ్ స్టోరేజ్ ఇంధన ఉత్పత్తి ప్రాజెక్ట్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ ప్రాజెక్టు, వరల్డ్ క్లాస్ లగ్జరీ వెల్ నెస్ రిసార్ట్ – రూ. 15 వేల కోట్లు.

స్కైరూట్ ఏరో స్పేస్: ఇంటిగ్రేటెడ్ ప్రైవేట్ రాకెట్ తయారీ, టెస్టింగ్ యూనిట్ – రూ. 500 కోట్లు.

వీటితో పాటు ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, యూనిలీవర్ కంపెనీలు భారీగా పెట్టుబడులు పెట్టనున్నాయి.

## ఆదిలాబాద్ జిల్లాలో విషాదం... ఖోఖో ఆడుతూ తొమ్మిదో తరగతి విద్యార్థి మృతి

**నార్నూర్ మండలం భీంపూర్ జెడ్పీ హైస్కూల్లో ఘటన**

**గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్కూల్లో ఆటలపోటీలు**

**విద్యార్థికి ఇదివరకు స్టెంట్ వేసినట్లుగా సమాచారం**



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా విషాదం చోటు చేసుకుంది. జిల్లాలోని నార్నూర్ మండలం భీంపూర్ జెడ్పీ హైస్కూల్‌లో ఖోఖో ఆడుతూ తొమ్మిదో తరగతి విద్యార్థి బన్నీ కుప్పకూలిపోయాడు. ఆసుపత్రికి తరలించగా అతను మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు.గణతంత్ర దినోత్సవం సందర్భంగా పాఠశాలలో ఆటలపోటీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా విద్యార్థులు ఖోఖో ఆడుతుండగా ఈ విషాదకర ఘటన చోటు చేసుకుంది. బన్నీకి గతంలో గుండెపోటు రావడంతో స్టెంట్ వేసినట్లు తెలుస్తోంది. బన్నీ మృత్యువాత పడటంతో ఆ విద్యార్థి కుటుంబంలో, గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# మీకు కిడ్నీ సమస్యలు ఉంటే.. ఈ ఫుడ్ అస్సలు తినొద్దు




**హైదరాబాద్ పెన్ పవర్:**కిడ్నీలు.. మన శరీరంలో రక్తాన్ని శుద్ధి చేసి మలినాలను బయటికి పంపడంలో కీలకంగా వ్యవహరిస్తాయి. అంతే కాకుండా రక్తంలో ఉండాల్సిన వివిధ పదార్థాలను కంట్రోల్ చేస్తుంది. కిడ్నీలు ఆరోగ్యంగా లేకపోతే శరీరం చాలా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే.. మన శరీరంలో గుండె తర్వాత అంత కీలకమైన అవయవం కిడ్నీలే. కిడ్నీలు ఆరోగ్యంగా ఉండాలంటే సరిపడా నీళ్లు తాగటం ఎంత ముఖ్యమో కొన్ని ఫుడ్స్ కి దూరంగా ఉండటం కూడా అంతే ముఖ్యం.

కిడ్నీ సమస్యలు ఉన్నవారు తినకూడని ఫుడ్స్:

**అవకాడో:**

అవకాడోలో గుండెకి మేలు చేసే హార్ట్ హెల్తీ ఫ్యాట్స్, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్స్, ఉన్నప్పటికీ వీటిలో అధిక శాతం పొటాషియం ఉంటుంది కాబట్టి కిడ్నీ సమస్యలు ఉన్నవారు వీటిని అస్సలు తినకుండా ఉండటం మంచిది.

**డైరీ ప్రొడక్ట్స్:**

ఫ్యాట్ అధికంగా ఉండే చీజ్, బట్టర్, క్రీంలు కిడ్నీలను ఇబ్బందికి గురి చేస్తాయి. అంతే కాకుండా వీటిని తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ లెవెల్స్ పెరిగిపోయి కార్డియోవస్కులర్ సమస్యలు వచ్చే అవకాశం ఉంది కాబట్టి కిడ్నీ సమస్యలు ఉన్నవారు వీటిని అస్సలు తీసుకోకుండా ఉండటం మంచిది.

**ప్రాసెస్డ్ మీట్:**

ప్రాసెస్డ్ మీట్ లో సోడియం, ఫాస్ఫర్స్, అన్ హెల్తీ ఫ్యాట్స్ ఉంటాయి కాబట్టి.. వీటిని తిన్నప్పుడు బ్లడ్ ప్రెజర్ పెరిగి కిడ్నీల పనితీరుపై పడుతుంది. అంతే కాకుండా కార్డియో వస్క్యులర్ సమస్యలు, కిడ్నీ వ్యాధులకు దారి తీస్తుంది. కాబట్టి కిడ్నీ సమస్యలు ఉన్నవారు వీటికి దూరంగా ఉండటం మంచిది.

**టమోటాలు:**

టమోటాల్లో పొటాషియం అధికంగా ఉంటుంది కాబట్టి కిడ్నీ సమస్యలు ఉన్నవారు టమోటాలు తినకపోవడం మంచిది.

**నారింజ:**

నారింజలో విటమిన్ సి తో పాటు పొటాషియం కూడా అధికంగా ఉంటుంది కాబట్టి కిడ్నీ సమస్యలు ఉన్నవారు నారింజ అస్సలు తినకపోవడం మంచిది.

**రెడ్ మీట్:**

రెడ్ మీట్ లో ప్రోటీన్స్, పసఫోరస్ ఎక్కువగా ఉంటుంది. ఇవి కిడ్నీలను డ్యామేజ్ చేస్తాయి కాబట్టి కిడ్నీ సమస్యలు ఉన్నవారు వీటిని అస్సలు తినకపోవడం మంచిది.

**నిల్వ ఉంచిన ఆహారం:**

నిల్వ ఉంచిన కూరగాయలు, బీన్స్ లో అధికంగా సోడియం ఉంటుంది. బ్లడ్ ప్రెజర్ ని పెంచి ఫ్లూయిడ్ రిటెన్షన్ కి దారి తీస్తుంది. దీంతో కిడ్నీలపై అధిక ఒత్తిడి పెరుగుతుంది. కాబట్టి కిడ్నీ సమస్యలు ఉన్నవారు వీటిని అస్సలు తినకుండా ఉండటం మంచిది.

**రిఫైన్డ్ సుగర్స్:**

రిఫైన్డ్ సుగర్స్ అధికంగా ఉండే సోడా, స్వీట్స్, బరువును పెంచుతాయి, బ్లడ్ షుగర్ లెవెల్స్ ను పెంచుతాయి. ఇది కిడ్నీలపై తీవ్ర ప్రభావం చూపుతుంది కాబట్టి కిడ్నీ సమస్యలు ఉన్నవారు వీటికి దూరంగా ఉండటం మంచిది.

**ఆల్కహాల్:**

ఆల్కహాల్ తీసుకోవడం వల్ల బ్లడ్ ప్రెజర్ పెరుగుతుంది.. బాడీ డిహైడ్రేట్ అవుతుంది. ఇది కిడ్నీలపై తీవ్ర ప్రభావం చూపుతుంది కాబట్టి కిడ్నీ సమస్యలు ఉన్నవారు ఆల్కహాల్ కి దూరంగా ఉండటం మంచిది.

# ఏంటీ తేడా.. ఎందుకీ తేడా : ఫోన్ ఆధారంగా రేట్లు ఎలా నిర్ణయిస్తారంటూ ఉబర్, ఓలాకు నోటీసులు




**హైదరాబాద్ పెన్ పవర్:**సొంత వెహికల్ లేనివారికి ఒకప్పుడు ఆర్టీసీ బస్సులు లేదా షేర్ ఆటోలు మాత్రమే ఆప్షన్ గా ఉండేవి కానీ ఇప్పుడు ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి ట్యాక్సీ యాప్స్ వచ్చేశాయి. సిటీలో చేతిలో ఫోన్ ఉన్నవారు ప్రతి ఒక్కరు ఈ యాప్స్ వాడుతున్నారనటంలో అతిశయోక్తి లేదు. అయితే.. యూజర్ల వీక్ నెస్ ని క్యాష్ చేసుకుంటున్నాయి ట్యాక్సీ యాప్ లు. యూజర్లు వాడుతున్న ఫోన్ ని బట్టి వేరు వేరు చార్జీలు వసూలు చేస్తున్నాయి ఓలా, ఉబర్ వంటి యాప్స్. యూజర్ వాడే ఫోన్ ను బట్టి ఒకే లొకేషన్ కు యాండ్రాయిడ్ ఫోన్ అయితే ఒక రేటు.. ఐఫోన్ ఐతే మరో రేటు వసూలు చేస్తున్నాయి ట్యాక్సీ యాప్స్.ఈ మేరకు గురువారం ( జనవరి 23, 2025 ) ఓలా, ఉబెర్‌లకు నోటీసులు జారీ చేసింది కేంద్రం.. రైడ్ బుక్ చేయడానికి ఉపయోగించే మొబైల్ ని బట్టి వేరు వేరు చార్జీలు వసూలు చేస్తున్నారంటూ వచ్చిన కంప్లైంట్స్ పై వివరణ కోరుతూ నోటీసులు జారీ చేసింది వినియోగదారుల మంత్రిత్వ శాఖ.

కంపెనీలు తమ ప్రైసింగ్ పద్దతిని వివరించాలని.. నోటీసులతో కోరింది కేంద్రం. మొబైల్ ఫోన్ మోడల్స్, బ్యాటరీ లెవెల్స్ ని బట్టి ఛార్జీలను పోల్చి చూస్తూ.. ఒకే లొకేషన్ కి వేరువేరు చార్జీలు వసూలు చేస్తున్నారంటూ ఓ నెటిజన్ ఎక్స్ వేదికగా షేర్ చేసిన పోస్ట్ వైరల్ గా మారింది.అతని పోస్ట్ వైరల్ కావడంతో, ఆరోపణలపై స్పందించింది ఉబర్ సంస్థ, ఫోన్, ఓఎస్ ఆధారంగా చార్జీలు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలను ఖండించింది ఉబర్ .


పిక్-అప్ పాయింట్‌లు, ఎక్స్పెక్టెడ్ టైం ఆఫ్ అరైవల్ డ్రాప్-ఆఫ్ పాయింట్‌లలో తేడా వల్ల ఛార్జీలలో వ్యత్యాసం ఉండచ్చని వివరణ ఇచ్చింది ఉబర్. ఈ అంశంపై స్పందించిన కేంద్రం వినియోగదారుల దోపిడీని ఏమాత్రం సహించబోమని, సమగ్ర విచారణ జరిపి నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపింది.

# తెలంగాణలో భారీ పెట్టుబడులు పెట్టనున్న జేఎస్ డబ్ల్యూ.. దావోస్ లో ఒప్పందం




**హైదరాబాద్ పెన్ పవర్:**దావోస్ లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో తెలంగాణ ప్రభుత్వం పలు సంస్థలతో ఒప్పందాలు చేసుకుంటోంది. ఇప్పటికే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు ముందుకొచ్చాయి. ప్రభుత్వంతో ఎంవోయూలు చేసుకున్నాయి. తాజాగా తెలంగాణలో మానవ రహిత ఏరియల్ సిస్టమ్స్ తయారీ యూనిట్ ను స్థాపించనున్నట్టు జేఎస్ డబ్ల్యూ సంస్థ ప్రకటించింది. అమెరికాకు చెందిన డిఫెన్స్ టెక్నాలజీ సంస్థ అనుబంధంతో ఈ యూనిట్ ను నెలకొల్పనుంది. రూ. 800 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. దీని ద్వారా 200 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. ఈ మేరకు జేఎస్ డబ్ల్యూతో రాష్ట్ర ప్రభుత్వం ఎంవోయూ కుదుర్చుకుంది.ఈ సంస్థతో రక్షణ రంగంలో కీలక ఆవిష్కరణలతో పాటు డ్రోన్ టెక్నాలజీకి తెలంగాణ ప్రధాన కేంద్రంగా మారుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈ ఒప్పందంపై మంత్రి శ్రీధర్ బాబు స్పందిస్తూ... రక్షణ రంగంలో అత్యాధునిక పరిజ్ఞానంతో పాటు తెలంగాణ అభివృద్ధిలో ఈ ప్రాజెక్టు కీలకంగా మారుతుందని చెప్పారు.

# సైఫ్ అలీఖాన్‌ను నిజంగానే కత్తితో పొడిచారా? అనే అనుమానం కలుగుతోంది: మహారాష్ట్ర మంత్రి



**హైదరాబాద్ పెన్ పవర్:**బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌ను అసలు కత్తితో పొడిచారా? లేదా? అన్న అనుమానం కలుగుతోందని మహారాష్ట్ర మంత్రి నితీశ్ రాణే అనుమానం వ్యక్తం చేశారు. ఓ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ... ముంబైకి వస్తున్న బంగ్లాదేశీయులు ఏం చేస్తున్నారో చూడండి... సైఫ్ అలీఖాన్ ఇంట్లోకి కూడా ప్రవేశించారన్నారు. ఇంతకుముందు రోడ్ల క్రాసింగ్‌లపై నిల్చునేవారని, ఇప్పుడు ఏకంగా ఇళ్లలోకి చొచ్చుకొని వస్తున్నారన్నారు.ఇంట్లోకి జొరబడిన బంగ్లాదేశ్ వ్యక్తి బహుశా సైఫ్ అలీఖాన్‌ను తీసుకువెళ్లడానికి వచ్చాడేమోనని ఎద్దేవా చేశారు. చెత్తను ఏరివేయడం మంచిదే అని వ్యాఖ్యానించారు. ఆసుపత్రి నుంచి అతను (సైఫ్) వచ్చిన తీరు చూస్తే, అతన్ని పొడిచారా? లేదా? అన్న అనుమానం కలుగుతోందన్నారు. ఆసుపత్రి నుంచి నాట్యం చేసుకుంటూ వచ్చినట్లు ఉందని... బహుశా నటిస్తున్నాడేమో అని వ్యాఖ్యానించారు.ఎన్సీపీ నేతలు జితేంద్ర అవద్, సుప్రియా సూలే వైఖరిని మంత్రి నితీశ్ రాణే ఖండించారు. షారుక్ ఖాన్, సైఫ్ అలీఖాన్‌లకు ఏదైనా జరిగితేనే వాళ్లు స్పందిస్తారని విమర్శించారు. ఖాన్‌ల గురించి ప్రతి ఒక్కరు మాట్లాడతారని, సుశాంత్ రాజ్‌పుత్ వంటి హిందూ నటులను వేధిస్తే మాత్రం ఒక్కరూ ముందుకు వచ్చి మాట్లాడరని మండిపడ్డారు.

# ఆ ఏరియాలో ప్లాట్లు కొంటుంటే జాగ్రత్త..! ఫారెస్ట్ ల్యాండ్ చూపెట్టి వేల మందిని మోసం చేశారు



**హైదరాబాద్ పెన్ పవర్:**మహావీర్ హరిణ వనస్థలి నేషనల్ పార్క్ అడవి భూములకు ముప్పొచ్చింది. కొందరు అక్రమార్కులు నేషనల్ పార్క్ స్థలాన్ని ప్రైవేట్ ల్యాండ్‌గా చూపిస్తూ అమ్మకాలుసాగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అటువంటి వారి మాటలు నమ్మి అమాయకులు మోసపోవద్దని శంషాబాద్ డిఎఫ్ఓ విజయానంద్, సరూర్ నగర్ ఎంఆర్ఓ వేణుగోపాల్ తెలిపారు.ఫారెస్ట్ ల్యాండ్ చూపెట్టి 50వేల మందికి మోసం

**అసలేం జరిగిందంటే..?**

ఎల్బీ నగర్ మన్సూరాబాద్‌లోని సర్వే నంబర్ 7లో 582 ఎకరాల ఫారెస్ట్ ల్యాండ్ ఉండగా.. ఆ భూమి తమ తల్లిదని యూసఫ్ ఖాన్‌తో పాటు ఆయన భార్య తులసమ్మ అలియాస్ సుల్తానా గిఫ్ట్ డీడ్, సేల్ డెడ్, నోటరీ ప్లాట్ల ఫేక్ డాక్యుమెంట్ రాయించి అమాయకులకు అమ్ముతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ నెల 26న గణతంత్ర దినోత్సవ సందర్భంగా సర్వే నెంబర్ 7లో జెండా ఎగరేయపోతున్నట్లు ప్లాట్లు కొనుగోలు చేసిన వారు పెద్ద ఎత్తున అక్కడికి రావాలని మహ్మద్ జిలానీ అనే వ్యక్తి పేరుతో సోషల్ మీడియాలో ప్రకటనలు వ్యాప్తి చేశారు.

ఈ విషయం పోలీసుల చెవిన పడడంతో ప్రజలను అప్రమత్తం చేశారు. ఫారెస్ట్ ల్యాండ్‌లో ఎటువంటి ప్లాట్లు లేవని.. ఎవరూ కూడా ఆ డాక్యుమెంట్స్ చూసి మోసపోవద్దని సూచించారు. ఇప్పటికే కొనుగోలు చేసిన వారు ఎవరైనా ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేస్తే తగిన న్యాయం జరిగే అవకాశం ఉంటుందని సూచించారు. మోసగాళ్ల మాటలు నమ్మి ఎవరైనా ఫారెస్ట్ భూముల్లోకి వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.సర్వే నంబర్ 7లోని 582 ఎకరాల భూమి ఎన్నో ఏళ్లుగా ఫారెస్ట్ భూమిగా రికార్డుల్లో ఉన్నట్లు తెలిపారు. ఆ భూమి ప్రైవేట్ భూమి అని క్లెయిమ్ చేసేందుకు పిటీషనర్ తరపు న్యాయవాది ఇప్పటివరకు

280 పిటీషన్స్ దాఖలు చేయగా.. వాటిని కోర్టు కొట్టేసిందని ప్రజలకు గుర్తుచేశారు. కావున తక్కువ ధరకు వస్తున్నాయని అడవి భూములు కొని మోసపోవద్దని పోలీసులు ప్రజలకు సూచించారు.

# పఠాన్ చెరు ఘటనపై టీపీసీసీ సీరియస్.. విచారణకు కమిటీ ఏర్పాటు


TELANGANA PRADESH CONGRESS COMMITTEE
GANDHI BHAVAN, HYDERABAD - 500001
Phone : 040-24603718
040-24602484
Fax : 040-24602383
040-24601254

T. KUMAR RAO, B.Sc., LLB
Senior Vice-President

ORDER – 23-01-2025

Shri B. Mahesh Kumar Goud, President, TPCC has constituted a committee to look into the incident happened today in Patancheru assembly segment with the following Congress party leaders.

1. **Shri Aadi Srinivas**, MLA & Whip
2. **Shri M.R.G. Vinod Reddy**, Vice-President, TPCC

The committee will examine and submit its report at an early date.

(T. Kumar Rao)

To
**Shri Aadi Srinivas,**
MLA & Govt. Whip
**Shri M.R.G. Vinod Reddy,**
Vice-President, TPCC

**హైదరాబాద్ పెన్ పవర్:** పఠాన్ చెరు కాంగ్రెస్ లో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి క్యాంప్ ఆఫీసుపై నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ అనుచరులు దాడి చేయడం ఇరు వర్గాల మధ్య అగ్గి రాజేసింది. నేతల మధ్య వర్గ పోరు ప్రభుత్వానికి ఇబ్బందిగా మారడంతో పఠాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ లో జరుగుతోన్న పరిణామాలపై టీపీసీసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో పఠాన్ చెరు కాంగ్రెస్ లో చోటు చేసుకున్న ఘటనపై టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఆదేశాల మేరకు విచారణకు ఆదేశించింది. ఈ మేరకు ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, పార్టీ ప్రధాన కార్యదర్శి వినోద్ రెడ్డిల కమిటీ సభ్యులుగా నియమించిన టీపీసీసీ.. పఠాన్ చెరు ఘటనపై విచారణ జరిపి పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.

కాగా.. పఠాన్ చెరు కాంగ్రెస్ లో వర్గ విభేదాలు తారాస్థాయికు చేరుకున్నాయి. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి వెళ్లిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి.. నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ మధ్య వర్గ పోరు మరింత ముదిరింది. ఎమ్మెల్యే గూడెం అసలైన కాంగ్రెస్ కార్యకర్తలను పట్టించుకోవడం లేదని.. కాంగ్రెస్ నేతలపైన దాడులు చేయిస్తున్నారని గురువారం (జనవరి 23) కాట శ్రీనివాస్ గౌడ్ అనుచరులు నియోజకవర్గంలో ఆందోళన చేపట్టారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి దిష్టి బొమ్మ దగ్ధం చేసేందుకు ప్రయత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు.

దీంతో పోలీసులు, కాంగ్రెస్ కార్యకర్తలకు మధ్య వాగ్వాదం చేసుకుంది. ఇదిలా ఉండగానే.. కాట శ్రీనివాస్ గౌడ్ అనుచరులు పఠాన్ చెరు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు ముట్టడించారు. ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ఫర్నీచర్ ధ్వంసం చేయడంతో పాటు కుర్చీలు ధ్వంసం చేశారు. ఈ ఘటనపై ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఫైర్ అయ్యారు. కాట శ్రీనివాస్ గౌడ్ పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి.. ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసుపై కాంగ్రెస్ కార్యకర్తల దాడిని హై కమాండ్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. కాట, గూడెం మధ్య వర్గ పోరు తీవ్ర స్థాయికి చేరడంతో పఠాన్ చెరు నియోజకవర్గ పరిణామాలపై కాంగ్రెస్ విచారణకు ఆదేశించింది

## నెల తక్కువున్నా పర్లేదు.. అమెరికా పౌరసత్వం కోసం సిజేరియన్లు చేయమంటున్న భారత జంటలు




**హైదరాబాద్ పెన్ పవర్:** రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ ) విదేశీయుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాడు. అమెరికా అధ్యక్ష పగ్గాలను చేపట్టిన మొదటిరోజే వందకుపైగా కార్యనిర్వాహక ఉత్తర్వులపై (ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు) సంతకాలు చేశాడు. వీటిలో ముఖ్యమైనది.. జన్మతః పౌరసత్వం (అమెరికాలో పుట్టుకతో వచ్చే పౌరసత్వం).అమెరికాకు వలస వెళ్లిన వారు ఆ గడ్డపై పిల్లలకు జన్మనిస్తే.. ఆ చిన్నారులకు అక్కడి పౌరసత్వం లభించేది. ఆ చట్టాన్ని ట్రంప్ రద్దు చేశారు. ఈ నెల 20తేదీన ప్రమాణస్వీకారం చేసిన ట్రంప్.. అదే రోజు వలసదారుల సిటిజెన్‌షిప్ రద్దు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. సంతకం చేసిన 30 రోజుల్లో ఇది అమల్లోకి వస్తుంది. అందుకు గడువు.. వచ్చే నెల ఫిబ్రవరి 20. అంటే ఫిబ్రవరి 19 వరకు యుఎస్‌లో జన్మించిన పిల్లలు అమెరికన్ పౌరులుగా ఉంటారు. ఆ గడువు దాటితే ట్రంప్ ఆదేశాల ప్రకారం విదేశీయులు అమెరికా గడ్డపై పిల్లలకు జన్మనిచ్చినా అక్కడి పౌరసత్వం రాదు.ఈ క్రమంలో ఎనిమిది.. తొమ్మిది నెలల్లో ఉన్న గర్భిణీలు తమకు సిజేరియన్ చేయండి బాబోయ్ అంటూ అక్కడి ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. అలా ఆసుపత్రులకు వస్తున్న వారిలో భారతీయ జంటలే ఎక్కువున్నట్లు అక్కడి వైద్యులు చెప్తున్నారు. కొన్ని జంటలైతే ఏడో నెలలోనూ తమకు సిజేరియన్ చేయమని హాస్పిటల్లకు వెళ్తున్నారట. ఏడో నెలలో సిజేరియన్ బిడ్డ ఎదుగుదలపై ప్రభావం చూపుతుందని చెప్తున్నప్పటికీ, కొన్ని జంటలు తమను కన్విన్స్ చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని న్యూజెర్సీకి చెందిన ఓ డాక్టర్ మీడియాకు తెలిపారు.

యూఎస్‌లో దాదాపు పదివేల మంది భారతీయులు తాత్కాలిక %H-1B, L%1 వీసాలపై పనిచేస్తున్నారు. వీరంతా USలో శాశ్వత నివాసం కల్పించే గ్రీన్ కార్డ్‌ల కోసం కూడా క్యూలో ఉన్నారు. ట్రంప్ నిర్ణయంతో వీరిది ఎటూ తేల్చుకోలేని పరిస్థితి. అందుకే ఫిబ్రవరి 20లోపు సి-సెక్షన్ ద్వారా బిడ్డలను ప్రసవించాలనే హడావుడి.

## భార్యను చంపేముందు కుక్కను చంపాడు



**రంగారెడ్డి:** భార్యను చంపి డెడ్ బాడీని కుక్కర్లో ఉడకపెట్టిన భర్త.. కేసులో సంచలన విషయాలు బయటపడ్డాయి. భార్య మాధవిని చంపి ఆనవాళ్లు లేకుండా చేయాలని భర్త గురుమూర్తి భావించాడు. మటన్ కొట్టే కత్తితో భార్య శరీరాన్ని ముక్కలుగా నరికాడు. ఆపై ఎముకల నుంచి మాంసాన్ని వేరు చేసి కుక్కర్లో ఉడికించాడు. ఎముకలను కాల్చి, ఆపై దంచి పొడి చేసి ఆనవాళ్లు లేకుండా చేయడానికి ప్రయత్నం చేసాడు. వీటన్నిటినీ కవర్లలో పెట్టి జిల్లెలగూడ చెరువులో పడేసాడు. భార్యను చంపడానికి ముందు అతను ప్రాక్టీస్ కోసం ఓ కుక్కను చంపినట్టు సమాచారం.

## కొత్తగూడెం క్లబ్లో మెంబర్షిప్ ఇవ్వాల్సిందే..!

**ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం డిమాండ్**



**హైదరాబాద్ పెన్ పవర్:**కేవలం పెద్ద వర్గానికే కాకుండా పేద మధ్యతరగతి వర్గానికి కూడా కొత్తగూడెం క్లబ్బులో మెంబర్షిప్ ఇవ్వాలని

తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. మెంబర్షిప్ ఇచ్చే సందర్భంగా తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి యువజన నాయకులను కలుపుకోవాలని పేర్కొంది. ఎస్టీ నుంచి సాంబశివ నాయక్ ఎస్సీ నుంచి కోట శివశంకర్ బీసీ నుంచి అనుదీప్ మైనార్టీ నుంచి మహమ్మద్ జలాల్ పేర్లను పరిగణలోకి తీసుకొని మెంబర్షిప్ ఇవ్వాలని విద్యార్థి సంఘం విజ్ఞప్తి చేసింది. మెంబర్షిప్ ఇచ్చి శుక్రవారం జరిగే జనరల్ బాడీ మీటింగ్ లో పైన పేర్కొన్న వారిని పాల్గొనే విధంగా చూడాలని ఆర్డిఓ డిఎస్పికి సంఘం విజ్ఞప్తి చేసింది.

## సమాచార హక్కు చట్టం యాక్టివిస్ట్ సొసైటీ జిల్లా మీడియా కన్వీనర్ గా గరిడేపల్లి మురళి



**హైదరాబాద్ పెన్ పవర్:**:హక్కులను ఉపయోగించుకోవడం ప్రతి పౌరుడు బాధ్యత అని సమాచార హక్కు చట్టం యాక్టివిటీ సొసైటీ జిల్లా మీడియా కన్వీనర్ గరిడేపల్లి మురళి అన్నారు.గురువారం తనను జిల్లా మీడియా కన్వీనర్ గా ఎన్నుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తన ఎన్నికకు సహకరించిన జిల్లా అధ్యక్షుడు గుగులోతు నరేష్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.తనకు ఇచ్చిన అవకాశాన్ని జిల్లా పౌరులకు పూర్తిస్థాయిలో సమాచార హక్కుల పై అవగాహన వచ్చేలా కృషి చేస్తానని ఆయన తెలిపారు.సమాచార హక్కు చట్టం ద్వారాపూర్తి సమాచారాన్ని తెలుసుకోవడం ప్రతి పౌరుడు భాద్యతా అని ఆయన పేర్కొన్నారు.ప్రభుత్వ కార్యాలయాలు,సంస్థల నుండి సమాచారాన్ని అడిగి తెలుసుకోవడమే సమాచారం హక్కు అని ఆయన తెలిపారు. 2005 వ సంవత్సరం సమాచార చట్ట హక్కు అమలులోకి వచ్చిందని ప్రభుత్వ అధికారులు అడగకపోయినా వారంతట వారే విధి విధానాలు ఉద్యోగుల బాధ్యతలు మొదలగు 17 అంశాలుగురించి సమాచారం ఇవ్వాలని తెలిపారు.

# విమానయాన బృందం పర్యటన శుభపరిణామం



- సానుకూల నివేదిక అందిస్తారని ఆశిస్తున్నా
- విమానాశ్రయం ఏర్పాటుకు గరీబీపేట ప్రాంతం అనుకూలం
- రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ప్రేత్యేక ద్రుష్టి సారించాలి
- విమానాశ్రయం అధ్యయన బృందంతో భేటీ అయిన ఎమ్మెల్యే కూనంనేని

**హైదరాబాద్ పెన్ పవర్:**కొత్తగూడెం ప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటు చేసేందుకు కావాల్సిన పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు పౌర విమానయాన ప్రతినిధులు కొత్తగూడెంలో పర్యటించడం శుభ పరిణామని బృందం పర్యటనతో విమానాశ్రయం ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైనట్లేనని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. గరీబ్ పేట ప్రాంతాల్లో అధ్యయన బృందంతో గురువారం భేటీ అయిన కూనంనేని ఇక్కడి పరిస్థితులను విమానాశ్రయం ఏర్పాటు ఆవశ్యకతను బృందానికి వివరించారు. అనంతరం అయన మాట్లాడుతూ రామవరం-గరీబ్ పేట ప్రాంతంలో ఉన్న స్థలాన్ని బృందం పరిశీలించిందని సానుకూలమైన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందిస్తారని ఆశిస్తున్నానన్నారు. స్థల సేకరణపై ఎలాంటి వివాదాలు ఉండబోవని ఈ ప్రాంత ప్రజలు విమానాశ్రయం ఏర్పాటుకు సానుకూలంగా ఉన్నారన్నారు. పారిశ్రామిక ప్రాంతంగా ఉన్న కొత్తగూడెంకు విమానాశ్రయం ఏర్పాటు చేయాలనే

లక్ష్యంతోనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని సమీపంలోని రాష్ట్రాలకు కూడా కొత్తగూడెం విమానాశ్రయం అనుకూలంగా ఉంటుందని తెలిపారు. విమానాశ్రయం ఏర్పాటుతో కొత్తగూడెం ప్రాంతమే కాకుండా భద్రాద్రి జిల్లా సమగ్రంగా అభివృద్ధి సాదిస్తుందని తెలిపారు. కూనంనేని వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, చైర్పర్సన్ సీతాలక్ష్మి, కమిషనర్ శేషాంజన్ స్వామి, కౌన్సిలర్లు కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, బోయిన విజయ్ కుమార్, ధర్మరాజు, సత్యనారాయణాచారి, మాచర్ల శ్రీనివాస్, యూసుఫ్, ఫహీమ్, పిడుగు శ్రీనివాస్, నేరెళ్ల రమేష్, గుత్తుల శ్రీనివాస్ తదితరులు వున్నారు.

# నగరాలకు ధీటుగా కొత్తగూడెం పట్టణం అభివృద్ధి





- ఉద్యోగ ఉపాది ఆకాశాల కల్పనపై ప్రత్యేక దృష్టి
- ప్రజాసమస్యలను గుర్తించి పరిస్కారానికి కృషి చేస్తున్నాం
- విమానాశ్రయం నిర్మాణానికి తొలి అడుగుపడింది
- కార్పొరేషన్ ఏర్పాటుతో కొత్తగూడెం దశ మారాబోతోంది
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు
- మున్సిపాలిటీలో రూ.6.32కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

**హైదరాబాద్ పెన్ పవర్:**నగరాలు మహానగరాలకు ధీటుగా కొత్తగూడెం పట్టణాన్ని అభివృద్ధి చేసి మెరుగైన సౌకర్యాలతో కార్పొరేట్ స్థాయి ఆవాస ప్రాంతంగా తీర్చి సిద్దేందుకు కృషి జరుగుతోందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 11వార్డుల్లో రూ. 6. 32కోట్ల డిఎంఎఫ్ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభల్లో కూనంనేని మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతం గిరిజన పల్లెలకు కేంద్రంగా ఉన్న కొత్తగూడెంను సుందర పట్టణంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. విద్య వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే పరిస్థితికి తావివ్వబోమన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటుతో ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని నూతన పరిశ్రమలు కార్పొరేట్ సంస్థల ఏర్పాటుకు బాటలుపడతాయన్నారు. విమానాశ్రయం ఏర్పాటుకు తొలి అడుగుపడిందని అందుకు సంబందించిన పనుల వేగవంతం కోసం ప్రభుత్వంపై వత్తిడి తెస్తానని తెలిపారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలనీ నాణ్యతతో నిర్మాణాలు జరిగేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, చైర్పర్సన్ సీతాలక్ష్మి, తహసీల్దార్ పుల్లయ్య, కమిషనర్ శేషాంజన్ స్వామి, డిఈ రవికుమార్, కౌన్సిలర్లు కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, మునిగడప పద్మ, మోరే రూప, నీలావతి, మమతా, ఉమారాణి, శ్రీవల్లి, సత్యభామ, భండారి, వనజ, బోయిన విజయ్ కుమార్, ధర్మరాజు, సత్యనారాయణాచారి, నాయకులు మునిగడప వెంకటేశ్వర్లు, మాచర్ల శ్రీనివాస్, యూసుఫ్, పల్లపోతు సాయి, అబిద్, ఫహీమ్, పిడుగు శ్రీనివాస్, జె.గట్టయ్య, నేరెళ్ల రమేష్, ధనలక్ష్మి, గడ్డం ప్రభాకర్, గుత్తుల శ్రీనివాస్, రాకేష్, ఇర్ఫాన్, కె.కిశోరె, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎయిర్పోర్ట్ తో భద్రాద్రి జిల్లా అభివృద్ధి

**ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి కొత్తగూడెంలో ఎయిర్పోర్ట్ స్థల పరిశీలన**



**హైదరాబాద్ పెన్ పవర్:**కొత్తగూడెం నియోజకవర్గానికి విమానాశ్రయం అవసరమని గత పాలకులు నేటి పాలకులు కేంద్రానికి పలుమార్లు విన్నవించిన విషయం అందరికీ తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎంపీ రామ సహాయం రఘురామిరెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరావు స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావులు ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, విమానాశ్రయ శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకి పలుమార్లు వినతి పత్రాలు అందించడం జరిగింది. దీంతో ఎయిర్పోర్ట్ అథారిటీ బృందం కొత్తగూడెంలో పర్యటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు గురువారం కొత్తగూడెం మున్సిపల్ పరిధిలోని రామవరం గరీబుపేట రుద్రంపూర్ తదితర ప్రాంతాల్లో ఏర్పోర్ట్ అథారిటీ బృందం విస్తృతంగా పర్యటించింది. ఈ పర్యటనలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి, స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ ఇతర అధికారులు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి మాట్లాడుతూ కొత్తగూడానికి ఎయిర్పోర్ట్ వస్తే ఎంతో అభివృద్ధి జరుగుతుందన్నారు. భద్రాద్రి జిల్లా గిరిజన జిల్లా కాబట్టి అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ జిల్లాలో పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయని దీనిని దృష్టిలో పెట్టుకొని విమానాశ్రయం కావాలని కేంద్రాన్ని అడగడం జరిగిందన్నారు.

విమానాశ్రయం ఏర్పాటుకు 900 పైగా ఎకరాల భూమి అవసరం ఉంటుందని పేర్కొన్నారు. ఈ భూమిని గుర్తించేందుకే ఎయిర్పోర్ట్ బృందం పర్యటించిందని తెలిపారు. పర్యటన వివరాలు బృందం కేంద్రానికి వివరిస్తుందని చెప్పారు. ఎయిర్పోర్టు పనులు కూడా సకాలంలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎయిర్ పోర్ట్ రాకతో కొత్తగూడెం నియోజకవర్గం రూపురేఖలు మారిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖ చెందిన ప్రభుత్వ అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలలో ఏరియా ముందంజ




**హైదరాబాద్ పెన్ పవర్:**బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలలో సింగరేణి కొత్తగూడెం ఏరియా ఎప్పుడూ ముందంజలో ఉంటుందని ఏరియా జిఎం శాలెం రాజు పేర్కొన్నారు. సింగరేణి సంస్థ కొత్తగూడెం ఏరియా కు 2024 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2025 జనవరి 22వ తేదీ వరకు 112.24 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని నిర్దేశించడం జరిగిందని అయితే ఇప్పటివరకు ఏరియాలో 110.19 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని వెలికి తీయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. గురువారం ఏరియా జిఎం కార్యాలయంలోనీ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిఎం శాలెం రాజు ఉత్పత్తి వివరాలను వెల్లడించారు. పివికే 5 గనికి ఇప్పటివరకు 2.83 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి నిర్దేశించగా 1.22 లక్షల టన్నుల ఉత్పత్తిని వెలికి తీయడం జరిగిందన్నారు. అదేవిధంగా సత్తుపల్లి జేవిఆర్ ఓసి-2కి 89.50 లక్షలు టన్నుల బొగ్గు ఉత్పత్తి నిర్దేశించగా 85.96 లక్షల టన్నుల ఉత్పత్తిని వెలికితీయడం జరిగిందన్నారు.. అదేవిధంగా కిష్టారం ఓపెన్ కాస్ట్ కు 19.22 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి నిర్దేశించగా 23.01 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించామన్నారు. ఇంకా సాధించాల్సిన ఉత్పత్తి లక్ష్యాన్ని సమిష్టి కృషితో సాధించాలని ఈ సందర్భంగా కార్మికులు అధికారులు కార్మిక సంఘాల నాయకులకు పిలుపునిచ్చారు. సింగరేణి సంస్థ వ్యాప్తంగా అన్ని ఏరియాలకంటే కొత్తగూడెం ఏరియాకే అధిక ఉత్పత్తిని నిర్దేశించడం జరిగిందని ప్రతి సంవత్సరం సంస్థ నిర్దేశించిన లక్ష్యం కంటే అధిక ఉత్పత్తిని వెలికి తీసి కొత్తగూడెం ఏరియాను మొదటి స్థానంలో కార్మికులు నిలుపుతున్నారని అభినందించారు. ఈ ఉత్పత్తి లక్ష్యాన్ని సైతం సాధించి ఏరియాను మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సింగరేణి సంస్థ కార్మికుల సంక్షేమంతో పాటు కార్మిక కుటుంబాలకు ఏర్పాటు చేయాల్సిన మౌలిక సదుపాయాల ఏర్పాటుపై ఎప్పుడు ప్రత్యేక దృష్టిని పెడుతుందని కార్మికులు కార్మిక కుటుంబాలు కార్మిక వాడల అభివృద్దే తమ ధ్యేయం అన్నారు. ఏరియాలోని రుద్రంపూర్ తో పాటు రామవరం తదితర ప్రాంతాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. రామవరంలోని కమ్యూనిటీ హాల్ ను అధునాతన హంగులతో రూపుదిద్దామన్నారు. కార్మికుల కోరిక మేరకు ఏసీ సౌకర్యాన్ని సైతం ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. రామవరంలోని చేమన్ అభివృద్ధితోపాటు రుద్రంపూర్ గ్రౌండ్ లో గడ్డిని వేస్తూ అందంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఎకో పార్కును గతంలో ప్రారంభించడం జరిగిందని ఇప్పుడు ప్రగతి వనాన్ని సైతం సుందరంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్ ఓ టు జిఎం జివి.కోటిరెడ్డి, ఇంచార్జ్ ఏరియా ఇంజనీర్ టి.రమణరావు, ఏజీఎం (సివిల్), సిహెచ్. రామకృష్ణ, ఎజిఎం(ఫైనాన్స్) కే.లత, డీజీఎం (పర్సనల్) బి.శివకేశవరావు, డిజిఎం (ఐఈడి) ఎన్.యోహన్, ఏరియా సెక్యూరిటీ అధికారి వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## కొత్త గోల్ తండా 3వ అంగన్వాడీ కేంద్రాన్ని క్లబ్ చేసిన అధికారులు





**హైదరాబాద్ పెన్ పవర్:**మండల పరిధిలోని కొత్త గోల్ తండా గ్రామంలో గల మూడవ అంగన్వాడి కేంద్రాన్ని 1వ అంగన్వాడి కేంద్రానికి క్లబ్ చేసినట్లు సిడిపిఓ పారిజాత తెలిపారు.గురువారం ఆమె మాట్లాడుతూ మూడవ అంగన్వాడి కేంద్రానికి చెందిన టీచర్ విధులకు హాజరు కాకుండా నిర్లక్ష్యం వహించడంతో పలుమార్లు షోకాజ్ నోటీసులు జారీచేసమని,తదుపరి చర్యల నిమిత్తం జిల్లా సంక్షేమ అధికారికి రిపోర్ట్ చేశామనీ అన్నారు.సదురు అంగన్వాడీ టీచర్ అప్స్కాండ్ లో ఉండడంతో లబ్ధిదారులకు ఇబ్బందులు తలెత్తకుండా అదేవిధంగా ప్రీ స్కూల్ పిల్లలు ముగ్గురే ఉండడంతో ఒకటవ కేంద్రానికి క్లబ్ చేసినట్లు చెప్పారు.ఈ సందర్భంగా పిల్లలకి పోషకాలతో కూడిన సమతుల్య ఆహారం అందించాలని,పిల్లల సంఖ్యను అంగన్వాడీలో పెంచే విధంగా కృషిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ మంగ, ప్రెసిడెంట్ ప్రైమరీ ప్రిన్సిపాల్ మోతిలాల్,స్థానిక మాజీ సర్పంచ్ బానోతు బాబు నాయక్,టీచర్ శ్రీదేవి,అంగన్వాడి టీచర్ గంగా తదితరులు పాల్గొన్నారు.

## నేతాజీ సుభాష్ చంద్రబోస్ సేవలు చిరస్మరణీయం



**హైదరాబాద్ పెన్ పవర్:**భరత జాతి గర్వించదగిన వ్యక్తిగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ చేసిన సేవలు చిరస్మరణీయమని బొమ్మనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఎం.జ్యోతిరాణి అన్నారు. గురువారం బొమ్మనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన దేశ స్వతంత్రం కోసం చేసిన పోరాటాన్ని త్యాగాన్ని విద్యార్థులకు హెచ్ఎం ఎం.జ్యోతిరాణి సవివరంగా విశదీకరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ టీచర్ జర్పుల పద్మ, ఐఈఆర్ పీ టీచర్ నీరజ, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాలకుర్తి బస్టాండ్ ను సందర్శించి పరిశీలించిన సీఐ మహేందర్ రెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:**పాలకుర్తి మండల కేంద్రంలోని బస్టాండ్ ను సందర్శించి ప్రయాణికులతో బస్టాండ్ సద్వినియోగం చేసుకోవాలని ప్రయాణికులకు సౌకర్యార్థం బస్టాండ్ లో అన్ని సదుపాయాలతో ఏర్పాటు చేశామని ప్రయాణికులకు తెలియజేశారు. బస్ డ్రైవర్లను కూడా బస్టాండ్ లోనే బస్సు ఆపాలని రాజీవ్ చౌరస్తా వద్ద బస్సులు ఆపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని కాబట్టి బస్సులు ప్రతి ఒక్కటి బస్టాండ్ లోనే ఆపి ప్రయాణికులకు గమ్యస్థానాలకు జాగ్రత్తగా చేరవేయాలని పాలకుర్తి బస్టాండ్ పాయింట్ కంట్రోలర్ కు సూచనలు చేశారు, అలాగే బస్టాండ్ ప్రాంగణాన్ని మొత్తం కలియ తిరుగుతూ పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు,

బస్టాండ్ పునరుద్ధరణలో విశేష కృషి చేసిన ఎస్ఐ లింగారెడ్డిని ప్రశంసించారు.

## అక్రమ నిర్మాణాల తొలగింపు పాతబస్తీనుంచి మొదలు పెట్టాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. పేదల ఇండ్లను అధికారులు తొలిగించడం సరైంది కాదని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. గురువారం నాడు ఆదర్శ్ నగర్ ఎమ్మెల్యే క్వార్టర్స్ లో అయన ఖైరతాబాద్ , సోమాజిగూడ డివిజన్ కు చెందిన లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓల్డ్ సిటీ లో అక్రమ నిర్మాణాలు కనిపించడం లేదా. మొదలు పెడితే అక్కడి నుండే తొలగింపులు చేయాలి. అధికారుల వైఖరి వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోంది. హైదరాబాద్ లో పుట్టి పెరిగిన వాడిని... హైదరాబాద్ ప్రజలకు అన్యాయం జరిగితే చూస్తూ ఉండలేను. పేద ప్రజల జీవనాధారం దెబ్బతిస్తే , వారికి అండగా ఉంటాను. అధికారులు తామే సుప్రీం అనుకుంటున్నారు. అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తే ఆ ప్రభుత్వాలు మనుగడ ఉండదు. ప్రభుత్వ ఆధీనంలో అధికారులు పని చేయాలి. హైడ్రా చెరువులను కాపాడటానికి పని చేస్తుంది , దానిని స్వాగతిస్తున్నాను. పబ్లిక్ నోటీస్ ఇచ్చి , కూల్చివేతలు చేయాలని అన్నారు.

## ట్రాఫిక్ కు ఇబ్బందులు కల్పిస్తే చర్యలు తప్పవు

తేల్చి చెప్పిన మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

హైదరాబాద్



**హైదరాబాద్ పెన్ పవర్:**మోండా మార్కెట్, రాంగోపాల్ పేట, బేగంపేట డివిజన్ లలో ఫుట్ పాత్ వ్యాపారులతో న ఎమ్మెల్యే,మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పోలీస్ అధికారులు సమావేశమయ్యారు. నిర్దేశించిన స్థలాల్లో నే వ్యాపారాలు జరుపుకోవాలని,రోడ్లపైకి వచ్చి ట్రాఫిక్ కు, ప్రజలకు ఇబ్బందులు కల్పిస్తే అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. ఫుట్ పాత్ వ్యాపారులు అధికారులకు సహకరించాలని అన్నారు. ట్రాఫిక్ కు ఇబ్బందులు కల్పిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## పటాన్ చెరు కాంగ్రెస్ ధర్నాలో ఉద్రిక్తత

**హైదరాబాద్ పెన్ పవర్:** గురువారం నాడు పటాన్ చెరు లో జరిగిన కాంగ్రెస్ ధర్నా లో ఉద్రిక్తత నెలకొంది. ఎమ్మెల్యే మహిపాల్రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేసేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నం చేసారు. పోలీసులు అడ్డుకోవడంతో కాంగ్రెస్ కార్యకర్తల తీవ్ర వాగ్వివాదం, తోపులాట జరిగింది. అందుకు నిరసనగా కాంగ్రెస్ నిరసనకారులు బీఆర్ఎస్ ఎమ్మెల్యే మహిపాల్రెడ్డి క్యాంప్ ఆఫీస్ ముట్టడించారు.

# "అంతర్వాహిని" ప్రత్యేక సంచిక ఆవిష్కరణ





**హైదరాబాద్ పెన్ పవర్:**కోదాడలోని స్థానిక పెన్షనర్స్ భవనములో "తెర" సాంస్కృతిక కళామండలి, కోదాడ రచయితల సంఘం, కోపరేటివ్ ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర జాయింట్ రిజిస్ట్రార్ ఆఫ్ కోపరేటివ్ తుమ్మా ప్రసాద్ ఉద్యోగ విరమణ సందర్భంగా కోదాడలో అభినందన సభ ఏర్పాటు చేయడం జరిగింది. ఇట్టి సమావేశానికి కోదాడ రచయితల సంఘం అధ్యక్షులు పుప్పాల కృష్ణమూర్తి అధ్యక్షత వహించగా, తుమ్మా ప్రసాద్ తో ఉన్న అనుబంధాన్ని వారి ఉద్యోగ ప్రస్థానాన్ని తెలియజేస్తూ ప్రచురించిన "అంతర్వాహిని"ప్రత్యేక సంచికను డాక్టర్ జాస్తి సుబ్బారావు ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని స్థానిక కే.ఆర్.ఆర్. ప్రభుత్వ జూనియర్ కళాశాల తెలుగు ఉపన్యాసకులు వేముల వెంకటేశ్వర్లు సమీక్షించారు. ముఖ్యఅతిథిగా కవి, రచయిత, సుధా బ్యాంకు ఫౌండర్ మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్ పాల్గొని మాట్లాడుతూ ... సమర్థవంతమైన అధికారిగా, క్రమశిక్షణ అంకితభావంతో పనిచేశారని వారి సేవలను కొనియాడారు. ఇకనుంచి కవిగా రాణించాలని అన్నారు. రాష్ట్ర పెన్షనర్స్ సంఘం ఉపాధ్యక్షులు రావెళ్ల సీతారామయ్య మాట్లాడుతూ వారి కుటుంబంలో అందరూ క్రమశిక్షణ కలిగిన ప్రభుత్వ ఉద్యోగులు కావడం అభినందనీయమని, ప్రజలకు సేవలతో పాటు, మంచి రచయితగా సమాజాన్ని మేలుకొలపడం అభినందనీయమని, వారితో ఉన్న ప్రత్యేక అనుబంధాలతో కూడిన ప్రత్యేక సంచికను ముద్రించినందుకు అభినందనీయులు అన్నారు. ఈ కార్యక్రమంలో చింతలపాటి శ్రీనివాసరావు , తుమ్మ భాస్కర్ , మేదరమెట్ల వెంకటేశ్వర్లు, ఖలీల్ అహ్మద్, సైదా నాయక్, పి.ఎ.సి.ఎస్ కార్యదర్శి యేసయ్య, డిగ్రీ క్లాస్మేట్ వీరయ్య, సీనియర్ ఇన్స్పెక్టర్ రవి, బంధువులు, పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు సంగిశెట్టి గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో విప్రో విస్తరణ

**హైదరాబాద్ పెన్ పవర్:**విప్రో కంపెనీ హైదరాబాద్లో తమ క్యాంపస్ విస్తరించనున్నట్లు ప్రకటించింది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని గోపనపల్లి లో కొత్తగా మరో ఐటీ సెంటర్ నెలకొల్పనుంది. దీంతో అదనంగా 5000 మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయి.దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, విప్రో ఎగ్జిక్యూటివ్ చైర్మన్ రిషద్ ప్రేమ్‌జీ తో సమావేశమయ్యారు. అనంతరం ఈ కీలక ప్రకటన విడుదల చేశారు.హైదరాబాద్‌లో ఐటీ రంగం వృద్ధిలో విప్రో కీలక భాగస్వామి. విప్రో క్యాంపస్ విస్తరణతో రాష్ట్రంలో సాంకేతిక రంగం మరింత వృద్ధి చెందనుంది. ఐటీ రంగంలో ఉపాధి అవకాశాలు పెరుగనున్నాయి.కొత్త ఐటీ సెంటర్ రాబోయే రెండు మూడేండ్లలో పూర్తవుతుంది. ప్రభుత్వంతో విప్రో చేసుకున్న ఒప్పందంతో ప్రపంచ ఐటీ పెట్టుబడుల గమ్యస్థానంగా తెలంగాణ ఖ్యాతి మరింత బలోపేతమవుతుంది. విప్రో విస్తరణ ప్రణాళికను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వాగతించారు. విప్రో లాంటి పేరొందిన సంస్థలకు తగిన మద్దతు ఇచ్చేందుకు, వ్యాపారాలందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందన్నారు.కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు, అవకాశాలు సృష్టించడానికి తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేయడం తమకు ఉత్సాహంగా ఉందని ఈ సందర్భంగా విప్రో ఎగ్జిక్యూటివ్ చైర్మన్ రిషద్ ప్రేమ్‌జీ అన్నారు.యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలలో భాగస్వామ్యం పంచుకోవాలని మంత్రి శ్రీధర్ బాబు విప్రో కంపెనీని ఆహ్వానించారు.

## బీసీ సమర శంఖారావం గోడ పత్రిక ఆవిష్కరణ

**హైదరాబాద్ పెన్ పవర్:**ఈనెల 30వ తేదీన ఇందిరా పార్క్ వద్ద నిర్వహించతలపెట్టిన బీసీ విద్యార్థుల సమర శంఖారావం సభను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. సభకు సంబంధించిన గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల వద్ద నిర్వహించారు. కార్యక్రమానికి జాజుల శ్రీనివాస్ గౌడ్ హాజరై గోడ పత్రికను ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్లో ఉన్నటువంటి ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలకు ప్రైవేట్ యూనివర్సిటీలో కూడా రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇందిరాపార్క్ వద్ద పెద్ద ఎత్తున బీసీ విద్యార్థుల సమర శంఖారావం సభ నిర్వహిస్తున్నామని ఈ సభకు తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి విద్యార్థులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరకాలం పూర్తి అయినప్పటికీ గత ఐదేళ్లుగా పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్లు విడుదల చేయకుండా అలసత్వం వహిస్తుందని మండిపడ్డారు. ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయకపోవడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమై మళ్ళీ వాళ్ళ కులవృత్తులు చేసుకునే పరిస్థితి వచ్చింది అన్నారు.

## బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌కు మరో షాక్



**హైదరాబాద్ పెన్ పవర్:** బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌కు మరో షాక్ తగలింది. అప్పు చెల్లించాలని షకీల్ కు బ్యాంక్ నోటీసులు ఇచ్చింది. తీసుకున్న రుణం సకాలంలో చెల్లించలేదని ఎస్బిఐ నోటీసులు జారీ చేసింది. రూ.19 కోట్ల బకాయి గడువులోగా చెల్లించకపోతే ఆస్తులు జప్తు చేస్తామని ప్రకటించింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇచ్చిన నోటీసులపై ఇప్పటివరకు మాజీ ఎమ్మెల్యే షకీల్ కానీ ఆయన అనుచరులు కానీ స్పందించలేదు. మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రాహిల్ ప్రజాభవన్ వద్ద మద్యం మత్తులో డివైడర్‌ను ఢీకొట్టడంతో కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. రెండు సంవత్సరాల క్రితం జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45లో షకీల్ కారు ఢీకొనడంతో ఒక చిన్నారి దుర్మరణం చెందిన విషయం విధితమే. ఇప్పటికే ఈ రెండు కేసులతో షకీల్ సతమతమవుతున్నారు.